# సందెన

సుట్టాల మార్గం పోదామని తయారైతన్న లచ్చవ్వకు చీరె కట్టుకునుడు యాష్టకత్తంది.

సింగులు కుదర్తలెవ్వు...

ఎప్పుడు గోసి పెట్టుకునేదే... సర్పంచిగ గెల్సినంక మండలానికి మీటింగుకు వోతె ఓ కారోబారి కారెడ్డమాడిండు...

"సర్పంచయినంక గూడ గోసివెట్టుకుంటవా? నీ మొగుడన్న జెప్పలేదా లచ్చువ్వా... గిట్ల గోసివెట్టుకోనత్తే పెద్దసార్లు చిన్నచూపు చూడరా..." అని.

ఆ రోజు మీటింగుల ఏం మనసునవట్టలే... మనసంత గోసిమీదనే వున్నది. ఆడోల్లల్ల ఎవల్లు కూడా గోసివెట్టుకొని రాలె... ఎవలు మందలిచ్చినా గోసిని జూసి నవ్వుతున్నట్టే అన్పిచ్చింది. రేపట్నుంచి ఆరుగజాల చీరెలు కట్టాలె... అనుకుంది.

అదేరాత్రి... మొగనితోని చెప్పింది.

"నేనెప్పుడో చెప్పిన నువ్వేమన్న ముసల్దానివా... అయినగని నువ్విప్పుడు సర్పంచివైతివి. పోలాల్లల్ల నాట్లేసుకునేటోల్లకు... బురుదల కూలీనాలీ జేసుకునేటోల్లకు మంచిగ గని... నువ్వు సర్పంచమ్మవైతివి' అన్నడు శంకరి.

"అయ్యో ... దెప్పుతున్నవా... నువ్వు నిల్చుండవెడ్తనే సర్పంచినైతి... నాకేమన్న కాయిశా?"

"ఇప్పుడు నేనేమన్న? మేర చంద్రయ్య దుకాండ్లకు వోయి మంచి చీరెలు దెచ్చుకో. ఆడు మనకు ఓటెయ్యేలే... ఉద్దెర మాఇత్తడు" అన్నడు.

తెల్లారి అయిదారు చీరెలు దెచ్చుకున్నది.

గ్రామసభకు చీరె కట్టుకొని వోతె... సూడనోల్లల్ల సూసిండ్రు. దారెంట వోతుంటె ఎవలేమనుకుంటుండ్రోనని మనుసంత అగులుబుగులైంది.

సర్పంచిగ తనమీద పోటీచేసి ఓడిపోయిన జల్పతిరెడ్డి పెండ్లాం ఎదురైంది. కొడుకు బడికివోనంటె రెట్టవట్టి గుంజుకపోవుకుంట అననే అంది.

"బడికివోక ఇంట్ల పడావ్‌జేత్తవ్‌రా పోడ... మాదిగోనికి సిరత్తె మంచమెక్కి తూలిండట" అని పేర్నాలవెట్టింది.

గుడ్లల్ల నీళ్లచ్చినయ్...

దళితకులంల పుట్టినందుకు చీరె కట్టుకునుడే పాపమైనట్టు... రెండ్రోజులు పూరంత ముచ్చట్లే...

'సర్పంచ్‌ది చీరె కట్టింది... ఎత్తు మడుమల చెప్పులేసింది' అని కొందరు ఎనుకాల ముచ్చట్లువెడితె...' ఒకప్పుడు గంజి తాగెటోల్లు... గంజి సీరెలు కట్టవట్రి' అని కొందరు మొకం మీదనే అన్నరు.

'సర్పంచై ఆర్నెల్లన్న కాలేదు... బాగనే సంపాయిత్తన్నట్టున్నవ్' అని ఓరగంట చూసుకుంట నవ్వినోల్లున్నరు.

'చెంద్రయ్య దుకాండ్ల కొన్నవా... చెందనా బదర్సుల కొన్నవా' అని కడుపంత మసిలిచ్చుకున్నోల్లున్నరు. గా మాటల్తోని మనుసంత మట్టిబెడ్డలెక్క దుల్లుదుల్లయింది. కండ్లల్ల నీళ్లు జూసి తెల్లకల్లు తాగినంక రాయలింగు మామ సెప్పిండు. "బాధపడకు బిడ్డా.. ఇన్ని రోజులు జన్నెపీనుగుల్లెక్కుంటే... జంగవిల్లుల్లెక్క కాల్చుకతిన్నరు. అదన మాదిగిది గెల్సినవని కైలాటుకాలు వెట్టుకుంటరు... కన్నెర్రజేత్తరు... తాకులాటలు వెడుతరు... తాగి తిడుతరు... అయినా గని... ఐబత్ దినకు... గట్టుకు కుక్కలు మొరిగినట్టనుకోవాలె... ఓపికవంతురాలు అని గౌరత దెచ్చుకో... ముల్లుని ముల్లుతోనే తీసుడు నేర్సుకోవాలె... పదో కిలాసు దాక సదువుకున్నదానివి. ఫలానా వూర్లె గా ఓరుగంటి రాయలింగని కోడలు సర్పంచంటె పన్నెండూల్ల పెట్టు పేతారపోవాలె... నీ మొగుడు చెప్తే కూడా ఆలోచించి చెయ్యాలె వాడు దొంగల్ల కలుత్తడు. ఇంట్లోల్లను లేపుతడు. బాయి గిర్కకు సందెన పడితె బలిమితోని తియ్యద్దు.... భరోసాతోని తియ్యాలె. లేకుంటే బొక్కెన నీల్లల్ల వడ్డట్టు నిండముంచుతరు. ఎందుకంటె మనం సూత్కపోల్లం బిడ్డా... " అని చెప్పిండు.

ఎప్పుడైనా వారం పదిరోజులు పుట్టింటికిపోతె గద్రాయించుతడు.

"దొరల్లెక్క ఉప్పోసకో, ఊరోటకో చెయ్యద్దు బిడ్డా. పదవంటె పుంజీతం ఆడుడుకాదు. పులిజూదం.... మనుసులవెట్టుకొని ఆడాలె..." అని. రాయలింగు మామ నీరడితనం జేత్తడు.

ఓపారి గుంటూరుకెల్లి ఓ కుటుంబం వచ్చి వూర్లె ఎరువులయి ఖాళీసంచులన్ని కొన్నరు. బోరెం కుట్టినట్టు కుట్టుకుంట.... వడ్లకల్లం కింద ఈ పట్టాల్ని పరిచి టాక్టర్‌తోనో, ఎడ్లతోనో కల్లం తొక్కి నప్పుడు వడ్లు భూమిల కలువయి అని చెప్పింండ్రు. పది రూపాయలకు ఓ పట్టా అని కిరాయికిచ్చుడు సురువుజేసింండ్రు. ఒక్కో కల్లం కింద పర్సుటానికి అయిదారు పట్టాలు అవసరం పడతయ్... రోజుకు పది పన్నెండు కల్లాలకు 'పట్టాలు' సప్లయ్ జేసుకుంట మస్తు సంపాయించింండ్రు. అల్లని మెచ్చుకుంటె రాయలింగు మామ తిట్టిండు.

ఊర్లె సంచులు కొని... ఊరోల్లకే కిరాయిచ్చే తెలివి మనకెక్కడిది బిడ్డా... వున్నా మనం ఎనుకా ముందు ఆలోచించెటోల్లం. కల్లాలు ఊడ్సుకొని మట్టిల కల్సిపోయిన వడ్లను రెక్కలన్ని పొంగ చెరిగి చెరిగి.. వడ్ల గింజల్ని పట్టుకపోయే కైరి గంగవ్వ నోట్లె మన్నువడ్డట్టె అయింది... ఆ పట్టాలతోని..." అన్నడు... అన్నట్టే... ఈయేడు వడ్లగింజలు దొరుకక కైరి గంగవ్వ ఆకలితోని మందోట కాడి బాయిల దునికి సచ్చిపోయింది.

రాయలింగు మామ తెలివి పెద్దది. గందుకే మామ మాటమీద నమ్మిక. "నీళ్లు బోసుకున్నవానె లచ్చవ్వా... సింగులు పుదియ్యబట్టి రెండు గంటలాయె" పక్కింటి నర్సవ్వ మాటతోని ఈలోకంలకచ్చింది లచ్చవ్వ.

నర్సవ్వ నవ్వి "ఇయ్యాల్ల శంకర్రెడ్డి పటేల్ పెండ్లాంది విడాకుల పంచాదట... గక్కడికేనా?" అనడిగింది.

"కాదు నర్సవ్వా... మా యారాలు కొడుకుయి పుట్టెంటికలు... కొమిరెల్లికాడ తీసుకచ్చింద్రట... ఎండపెల్లి కాడ ఇయ్యాల్ల దిగ్గొరుగుడు" అంది లచ్చవ్వ. నర్సవ్వ లోపలికెళ్లి రోకలి తీసుకొని పోయింది.

"కోడల్లి నీల్లువోసుకున్నది.... సింతకాయ తొక్కన్న నూరుత..." అనుకుంట.

ఇయ్యాల్ల రెడ్ల పంచాయితుందట... వెలుమ దొరలు పట్నాలు పోయినంక కాపోల్లదే రాజ్జెమైంది... శంకర్రెడ్డికి మొగతనం లేదు. నేను సంసారం జెయ్యనని ఆయన పెండ్లాం పంచాదివెట్టింది... అదిగాదు ఇదిగాదు... పాలేరోనికి మరిగింది. గందుకే మొగన్నిడిసి పెడ్తనంటంది అని రాత్రి పెనిమిటి చెప్పిండు.

అయినా... పిల్వని పేరంటం... ఎయ్యని ఇస్తారి అన్నట్లు మనకెందుకు అనుకున్నది చీరెకట్టుకొని... బొట్టుబిల్లవెట్టుకుంట....

సుంకరి బక్కయ్య మొసపోసుకుంట సైకిల్మీదచ్చిండు.

బరిసెను సైకిల్కి ఒరిగిచ్చి... ఆగమాగం అవుకుంట చెప్పిండు.

"సర్పంచవ్వా... శంకర్రెడ్డి పటేల్ది పంచాదున్నదట... కాపు సంఘం బిల్లింగ్లకు జెప్పన రమ్మంటుండ్రు" అన్నడు.

"నేను ఎండపెల్లికి పోతున్ననే బక్కన్నా రాకపోతె ఏమైతదే" అంది.

"మల్ల రేపు చెప్పలేదంటరని పిలిసుంటరు. అయినాగని... పెద్దలోకుల

పంచాదిల కూసోవాలె. రేపేమంటరు... సర్పంచిదానికి కండ్లు నెత్తికెక్కినయ్... పిల్చిన రాలేదంటరు. ఊరికి రేప్పొరాదు..” అన్నడు.

ఈ సర్పంచి పదవేందోగాని సరం తప్పి పాణం సందెన వడ్డట్టె అయితంది అనుకున్నదల్లా... ఆలోచించి పంచాయితి కాడికి నడిసింది సర్పంచ్ లచ్చవ్వ.

xxx xxx xxx

పంచాది మొదలైంది... ఇరవై, ముప్పయ్ మంది కూసున్నరు.

పెద్దకులపోల్ల పంచాదిల మొదటిసారి కూసున్నది సర్పంచి లచ్చవ్వ.

శంకర్రెడ్డి భార్య గంగవ్వ వాదన వింటండ్రు...

“మామిడితోట పైసల్తోని పత్తాలాట ఆడుడే గని... ఏం పని? పెండ్లయి రాండేండ్లాయె... పొల్లగాండ్లయిరా... బొట్టగాండ్లయిరా... నేనుసుత ఉప్పుకారం తింటున్న. మొగతనం లేనోడితోని ఏం సంసారంజెయ్యాలె... మాదిగోనికి అర్పమిచ్చినట్టే అయింది నా బతుకు...” అంది ఇజ్జత్ తెగాయించి.

లచ్చవ్వ పానం ఎల్లుకపోయింది...

పెద్దకులపోల్ల పంచాది... అందునా అక్రమ సంబంధాలకు సంబంధించిన నీచమైన పంచాది. దీనికి సంబంధం లేని ‘మాదిగోనికి అర్పమిచ్చినట్టే’ అన్న మాటకు పానం ఎల్లుకపోయింది.

మాదిగల్ని చేతల్లోనే కాదు... వాడి బతుకును బర్బాస్ చేసుటానికి ఎన్నెన్ని మాటలు పుట్టిచ్చిండ్రు అనుకుంది.

“నా ఇంట్ల ఉండుమంటె ఉండది ఏమైనా అల్లింటికే ఉరుకుతది. పూర్లె

సంబంధం అందుకుంటె గిదే పీకులాట. ఊకె అవ్వగారింటికి ఉరుకుడేంది" అన్నడు ఆమె భర్త శంకర్రెడ్డి.

"మరి దాని తల్లిగారింటికే నువ్వోయి ఉండరాదురా" అన్నడో పంచు.

"మాదిగోనింటికి డక్కలోడు అడుక్కోను వోయినట్టు... గదానింటికి నేనెందుకు వోత?" రోషంగా అన్నడు.

"అయినా... అత్తగారింటికి వోయిన అల్లుడు, మాదిగోనింటికి వోయిన కుక్క అని వట్టిగనే అన్నారా... నా కొడుకుని నేనెట్ల పంపుత" అన్నడు శంకర్రెడ్డి తండ్రి.

లచ్చువ్వ గుండెని తుమ్మ పొర్కతోని కప్పినట్టయింది. మాటల్ని మార్చాలని "గా మాటలకేంది గని... మీరు పెద్దకులపోల్లు... గిట్ల పంచాది వెట్టుకునుడే తప్పు అండ్లదండ్ల సంసారాన్ని ఇచ్చుల్లారం చేసుకుంటె ఏం ఫాయిదా?" అన్నది.

ఓ పెద్దకాపు అన్నడు "అది కాదే లచ్చవ్వా... ఊరన్నకాడ మాదిగిండ్లుండయా కాని సమస్య అదిగాదు. ఎవల మనసుల ఏముందో తెల్లగోలుగ జెప్పాలె" అని

మనుషుల్లో వున్న పాపపు గుణాన్ని తమ కులపు ఇండ్లతో పోల్చే సామెతలు వింటుంటె లచ్చువ్వ విలవిల్లాడింది.

"ఏం తెల్లగోలుగ జెప్పాల్నే... అవ్వగారింటిక్కూడా పోవద్దా... ఎంత రమ్మన్నా రాకపోతివి. ఏనాడు పెండ్లిల్ల అడుగుపెట్టిండో గని... ఇప్పటికి మల్ల మావోల్ల మొకంజూల్లె... అల్లేం తప్పు చేసింద్రు... మా తమ్ముని పెండ్లి వెట్టుకున్నప్పుడు ఆరొక్క తీరుగ బతిలాడినా రాలె... అడుగుంద్రి మీరే" అన్నది

గంగవ్వ తీగురంగ.

"అవున్రా శంకర్రెడ్డి.. మరి బామ్మర్ది పెండ్లివెట్టుకున్నా ఎందుకు పోలేదురా" అడిగిండో పంచు.

"నీయవ్వ... మాదిగోనింట్ల పండుగైతేంది, పబ్బమైతేందే? అలుగవోయిన కాడ అయిదునూర్లా పెట్టేది? నేనేమన్న మాదిగోన్ననుకున్నరా" శంకర్రెడ్డి రోషంగా చెప్పిండు.

లచ్చవ్వ గుండెకు ఎలగడ తగిలినట్టు కాలిపోయింది.

"అయిదు నూర్లే పెట్టిండ్రా... దానెంట అద్దతులం బంగారం పెట్టలేదా? అది చెప్పడేంది? మాదిగిమాట... నీళ్లమూట ఎంత పెడుతేంది? కనవడ్తలేదా?" గంగవ్వ పరుషంగనే అంది.

మరో పంచు కల్పించుకొని చెప్పిండు.

"ఇగో మాదిగోంది పెద్దముట్టు... మన్నెపోంది చిన్నముట్టు... ఇద్దరి దిక్కూ ఏదో తప్పు కనవడ్తనే వుంది. గవ్వన్ని ఉత్తరిచ్చుడెందుకు... తవ్వినకొద్దీ పెంకాసులే... మనుసులున్నది చెప్పరాదురా శంకర్రెడ్డి" అని

శంకర్రెడ్డి భూమీమ్మీద గీతలు గీసుకుంట అయిదు నిమిషాలు మౌనంగున్నడు. అటెనుక... "మాదిగి పుట్టుకకు మంచి గుణముంటాదె... అది పాలేరోనికి కొంగు పర్సిందని నా మనసుల తట్టింది..." అన్నడు.

"ఆనికి మొగతనం లేక... నామీద నిందేత్తండు. ఈని మాదిగినోట్లె ఉచ్చ... అయినోనికి పుట్టిండో... మాదిగోనికి పుట్టిండో మీరే అడుగుండ్రి" అని

దుమ్మువోసింది.

లచ్చవ్వ ప్రేక్షకురాలే అయింది.

మాటల తూటాలతో అంటరాని వాన్ని అంపశయ్యమీద పడుకో బెట్టినట్టు... తమ జాతిని అడుగడుగున కించపరుస్తున్న తీరుకు పెయ్యిపొంట ముండ్లచ్చినయ్.

"సాలు సంసారం జేసినంక నాకు మొగతనం లేదని గిప్పుడు యాదికచ్చిందా? దీని..." బూతుమాట తిట్టిండు. అది కూడా మాదిగ కులానికి చెందిందే. "మగతనం ఉన్నదో లేదో నాకు దెల్తది... నలుగుట్ల తెల్తదా?..." మొకం పక్కకు తిప్పుకొని అంది గంగవ్వ.

"చెప్పేటియ్ శీరంగ నీతులు.. చొచ్చేటియ్ మాల గుడిసెలు" శంకర్రెడ్డి గులుగుతున్నడు.

పంచులందరికి సమస్య జటిలంగ అన్పిచ్చింది.

చివరికి "ఆనికి మొగతనం ఉందని ఖరారుజేత్తె సంసారం జేత్తవానె గంగవ్వ" అనడిగింద్రు పంచులు.

కొంచెం సేపు మౌనంగున్నది.

గద్రాయించి అడిగింద్రు... చేస్తనని ఒప్పుకుంది.

దొమ్మరిండ్ల దగ్గరికి సుంకరోన్ని బేగిరం పంపింద్రు... అద్దగంటల సుంకరి దొమ్మరి రాధను వెంటబెట్టుకచ్చిండు.

ఇదంత లచ్చవ్వకు విచిత్రంగా అన్పిచ్చింది.

"రాధవ్వ... శంకర్రెడ్డి పటేలు రాత్రి నీదగ్గరకత్తడు. రేపు మల్ల పంచాదిల కూసుంటం. ఆనికి మొగతనం వుందో లేదో నువ్వే చెప్పాలె. నీమీదే ఆధారపడ్డది" అన్నడు పెద్దకాపు.

"మరి గిట్లాంటివాటికి నేను వెయ్యిదీస్కుంట. గిప్పుడు అయిదు వందలియ్యిండ్రి" అంది దొమ్మరి రాధ. సికనిండా మల్లెపూలు... కండ్లనిండా కాటుకె... మాటిమాటికి తుపుక్కు తుపుక్కుమని సిమ్లా గుట్క ఎక్కడబడితే అక్కడ్నే ఊంచుతంది.

దడువతు పైసల్లకెల్లి అయిదునూర్లు తీసిచ్చిండ్రు...

ఆరోజు పంచాది అయిపోయింది. అందరు లేసిండ్రు.

లచ్చవ్వ మనుసంత జిట్రేగి కట్టెలెక్క నల్లవడ్డది. అగ్ర కులాల పట్ల అసహ్యం కలిగింది. అడుగడుగునా చిన్న కులాల్ని మాటల్తో తూర్పార పడుతూనే... చివరికి ఒక దొమ్మరి కులస్తురాలి చేతిలో తీర్పు ఆధారపడింది. అది రేపు చెప్పేదాన్ని బట్టి దాని మాట ఎంత కీలకమైంది? కాని ఆ కులాల పట్ల ఎంత చులకన? !

లచ్చవ్వ ఇంటిదారి పట్టింది.

అవేమాటలు పెత్తరీగల్లెక్క వెంటాడి... వెంటాడి ముసురుకుంటున్నయ్. ఇంటికా పోంగనే రాయలింగు మామ కనవడ్డడు మోత్కాకు చుట్ట తాగుకుంట. లచ్చవ్వ కండ్లల్ల నీల్లు జూసి 'ఏమైంది బిడ్డా' అన్నడు. కన్నీళ్లు జలజలా రాలిపడ్డయ్.

"గీ మాటలింటేనే పానం శిదలు శిదలయ్యింది. అట్లాంటి బతుకును మీరెట్ల బతికిండ్రే... ఎట్ల ఓర్సుకున్నరే..." అంది లచ్చవ్వ.

రాయలింగు మనసుల, కండ్లల్ల మొగులు కమ్మినట్టయింది. ఎన్నెన్నో జ్ఞాపకాలు చరచరమంటూ పాకిపోయాయి.

బొండిగల కచ్చిన మాటలు సందెన వడ్డట్టు ఆగిపోయినయ్. "అప్పటి మా బతుకుల గురించి ఒక్క మాటల్ల చెప్పాలంటె... ఏ శాత్రం దొరుకుత లేదు బిడ్డా..." అని మాత్రం బలవంతంగా అనగలిగాడు.

xxx xxx xxx

మర్నాడు...

మల్ల పంచాది మొదలయింది. పెద్ద మనుషులు, శంకర్రెడ్డి, ఆయన భార్య గంగవ్వ, సర్పంచి, ఉప సర్పంచి అంతా కూసున్నరు.

దొమ్మరి రాధనే ఇంక రాలేదు...

సుంకరోన్ని గెదిమిండ్రు...

పదకొండిటికి నిమ్మలంగ వచ్చింది. రాధ రాంగనే అందరు ఆమె దిక్కే చూసిండ్రు.

ముసి ముసి నవ్వులు నవ్వుకుంట ఓ పెద్ద మనిషి అడిగిండు.

"ఏం సంగతే రాధవ్వా..." అని. రాధ ఓ గద్దెమీద కూసున్నది. జాకిట్లకెల్లి గుట్కా పొట్లం దీసి పండ్లతోనే సుంచి నోట్లెవోసుకున్నది. బీడీ తాగెటోల్లలెక్క మూతిమీద రెండు వేల్ల నుంచి తుపుక్కుమని ఊంచింది.

"గా అయిదువందలియ్యక పోతిరి" అంది ఎతిమినానుగ.

"అయ్యో... పారిపోతున్నామే... నీ పైసలెగ్గొడతమనుకుంటివా" అని ఓ

రైతు తీగురంగ అయిదువందలు చేతిల కుక్కిండు.

"దేంది దానికే పటేలా..." అనుకుంట కొంగుకు ముడేసుకుంది.

"సంసారి సాయక్క అన్నట్టు చెయ్యవట్టివేందే... జెట్టన చెప్పరాదు. మల్ల మల్ల నీ ఉచ్చ మందలగ్గావలంటె చింతచెట్టెక్కి చిమ్మిచ్చి కొట్టిండట నీ అసోంటోడు" మరో పంచు కోపంగ అన్నడు.

రాధ మొకం చిట్లిచ్చి... మూతి ఇరిసింది.

"పటేలు సప్పటోడే... గంగవ్వది తుర్తిలేని బతుకే" అన్నది.

ఆ మాట... అక్కడ ఒక విస్ఫోటనమే అయింది...

శంకర్రెడ్డి మొకం మాడిపోయింది. రాధ గట్లాంటి మాట చెప్పుతుందని ఎవ్వలు ఊహించలే...

అందరు గడ్డకట్టుక పోయినట్టయింద్రు...

పావుగంటకు... ఓ పెద్దమనిషి జెడ్తిచ్చినట్టు తేరుకొని...

"రాధవ్వా... ఇగ నువ్వు ఇక్కన్నుంచి పో..." అన్నడు.

రాధ ఎల్లిపోయింది.

"ఇంక చెప్పేదేముంది... చేసేదేముంది... విడాకులే" అన్నరు. కాయిదాల మీద పంచోట్కాలు జేసింద్రు.

గంట సేపట్ల అన్ని మాట్లాడుకొని ఇడుపుకాయిదాల మీద సంతకాలు దీస్కున్నరు. శంకర్రెడ్డి తల్కాయ నాలెకేసుకోని వోయిండు.

లచ్చవ్వ కూడా కాయిదాల మీద సాక్షి సంతకం పడేసి ఇంటికెల్లింది.

xxx xxx xxx

పది రోజులన్నా తిరుగలేదు...

మండలానికి మీటింగ్‌కని బయల్దేరిన సర్పంచి లచ్చవ్వ దగ్గరికి రాయలింగు మామ ఎగవోసుకుంటచ్చిండు.

"లచ్చవ్వా... ఇన్నావే... కాపోల్ల గంగవ్వ... ఆల్ల పాలేరోడు మన మాదిగి వెంకటేసు పోషమ్మ గుల్లె పెండ్లి జేసుకున్నరట... ఊరంత తల్లడమల్లడమైతంది. కాపోల్లు ఇయ్యాల్ల ఇండ్లల్లకెల్లి బైటకెల్లలేదనుకోరాదు..." అన్నడు ఆగమాగంగా.

లచ్చవ్వ నవ్వింది....

"గట్ల జరుగుతదని నాకు తెల్సు మామా..." అన్నది.

రాయలింగు నోరెల్లవెట్టిండు...."ఏంది బిడ్డా..." అన్నడు ఆశ్చర్యంగా.

"అవ్ మామా... పంచాదినాడు రాత్రి దొమ్మరి రాధని పిలిపిచ్చిన... రేపు పంచాదిల శంకర్రెడ్డి పటేలుకు మొగతనం లేదని జెప్పు... రెండు వేలిత్త... పిలేటు సాంక్షన్ జేయిత్త... అనంగనే 'గట్లెందుకవ్వా?' అనడిగింది రాధ. పాత సంగతులన్ని యాజ్జేసిన... వూర్లె ఒక్కనికి ఎయిడ్స్ అచ్చిందని తెల్వంగనే ఈ పటేండ్లు మిమ్ముల్ని ఊరవతలికి తరిమిండ్రు. ఊర్లె ఒక్క పొల్ల తప్పిపోతే దొమ్మరోల్లు అమ్ముకున్నరేమోనని మీ మీద పడి దాడి చేసిండ్రు... ఇయ్యాల్ల వాళ్ల కుల గౌరవానికి చెందిన పంచాది కాబట్టి పిలిపిచ్చిండ్రు.. మర్యాద జేసి అయిదు వందలు చేతులవెట్టిండ్రు... రేపు నేను చెప్పినట్టు చెప్పాలె అని వెయ్యి రూపాయలు

చేతులవెట్టిన. రాధ పైసల్ దీస్కోలె... మీరు చెప్పినట్లే జేస్త... మీరేమంత ఉన్నోల్లని మీ దగ్గర పైసల్ దీస్కుంట... అని ఎల్లిపోయింది" అని చెప్పింది లచ్చవ్వ.

రాయలింగు కొంచెం సేపు బీరిపోయిండు...

లచ్చవ్వ అటూ ఇటూ జూసి మల్ల జెప్పుడు షురుజేసింది.

"అటెనుక పాలేరు వెంకటేషుగాన్ని పిలిపిచ్చిన... మీ పటేలవ్వకు రేపు ఇడాకులైతన్నయ్... దాని మొగుడు అది నీకు అలువాటని ఇడిసిపెడ్తుండు... ఇడాకులైనంక తైతక్కలాడకు... పెండ్లి చేసుకుంటెనే పక్కల పండుకుంట అని చెప్పు... చిన్న కులపోల్లం... పెద్దకులం దాన్ని జేసుకున్నవంటె నీకే గౌరత పెరుగుతది. లేకపోతే పక్కల పండుకొని పుట్టెడు సాకిరీ చేయించుకుంటరు... అర్థమైందా? అని ఎచ్చరించిన. చేండ్లల్ల చెలుకల్ల అలువాటు పడ్డ పానం... పదిరోజులు దూరం కాంగనే అన్ని లగ్గం జేసుకోక తప్పలే..." అన్నది.

ఆ మాటలు విని రాయలింగుకు కొంచెం వణుకు పుట్టినా... కోడలు ధైర్యానికి మెచ్చుకోలుగా చూసిండు.

"ఏ కులపోల్లనైతే నీచపు మాటల్తో ఆడిపోసుకున్నరో... ఆ కులపోన్నే అల్ల ఇంటికి అల్లున్నిజేసిన.... మామా... ఇది నైతిక విజయం...." అన్నది.

కళ్లల్లో వెలుగులతో కూడిన కన్నీళ్లు...

"బిడ్డా... ఈ సంగతులన్ని ఇంకెవలకన్నా తెలుసా?" అన్నడు ఆందోళనగా.

"నీకు తప్ప ఇంకెవలకు సెప్పలే... సెప్పను గూడా! సందెన తీసుడేకాదు మామా... సందెనేసుడు కూడా నేర్సుకోకపోతే నేను సర్పంచినెట్లయిత ?!...."

అన్నది నవ్వుకుంట.

ఆ నవ్వుల... ఏదో గెలుపున్నది.

రాయలింగు లచ్చవ్వని గర్వంగా జూసిండు... చెవి సందుకెల్లి సుట్టదీసి అంటువెట్టి గుప్పుగుప్పున నాలుగుసార్లు దమ్ము పీల్చిండు.

"బిడ్డా .... భేష్... పులిలెక్క కనవడకుండనే పులిజూదం ఆడినవ్... పక్కల పండుకున్నప్పుడు మొగనికి కూడా చెప్పకు... ఎందుకంటె.... చవితి పండుగ, దసర పండుగ ముందు ముందున్నయ్... పెద్దకులపోల్లు మనమీద పగదీర్చుకోవడానికి గా రెండు పండుగలకోసం నాసువెట్టి సూత్తరు... తొండం దేవుడు నీళ్లల్ల పడంగనో, దసరనాడు జంబాకు తెంపుకోంగనో కైలాటుకాలు వెట్టుకొని... కత్తులు దూత్తరు... గిప్పటికైనా సమజైందా బిడ్డా... మనయన్నీ సందెనవడ్డ బతుకులు... నీలాంటోల్లే సవరియ్యాలే..."

రాయలింగు చుట్ట ఇంకో రెండు దమ్ములు తాగిండు... తుర్తిగా..!!!

*